ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

ఆదివారం 10 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.134	194	221
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4

రహదారులకు మహర్దశ



» ప్రతిష్ఠాత్మక రీజనల్ రింగ్‌రోడ్డుకు తొలగిన అడ్డంకులు
» నల్లగొండ నుంచి కర్నూల్‌కు అనుసంధానమయ్యే మరో జాతీయరహదారి
» ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కీలక రహదారులకు వరుస శంకుస్థాపనలు
» రూ.700కోట్లతో నల్లగొండబైపాస్‌రోడ్డుకు ప్రతిపాదనలు

నల్లగొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లా రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఓ వైపు రాజధానికి అనుసంధానించే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త కార్యాచరణచేపట్టగా, మరోవైపు ఉమ్మడిజిల్లాలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణానికి భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉమ్మడి జిల్లాలో రోడ్లు, విస్తరణ, కొత్త లేన్ల నిర్మాణాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా పనులకు వరుసగా శంకుస్థాపనలు చేస్తుండటంతో రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రోడ్ల అనుసంధానం మెరుగుకానుంది. కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల సమావేశమై జిల్లాలో ప్రాధాన్యమున్న రహదారులను ప్రతిపాదించారు.ఈ నెల రోజుల్లో కీలక రోడ్ల ప్రాజెక్టులకు మంత్రి శంకుస్థాపనలు చేయగా,మరికొన్ని కీలక ప్రాజెక్టులకు కేంద్రానికి నివేదించారు. ఇంకోవైపు జిల్లాలో అంతర్గత రోడ్ల మరమ్మతులు, కొత్త బీటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి త్వరలో పూర్తిస్థాయిలో అన్నిపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ సహా పలు కీలక ప్రాజెక్టులకు వినతి

ఇటీవల కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమైన సమయంలో కీలకమైన రీజనల్ రింగురోడ్డు చేపట్టేందుకు ఆటంకాలను తొలగించే అంశంపై చర్చించారు. ఉత్తర, దక్షిణ ప్రాజెక్టులను వీలైనంత వేగంగా చేపట్టేందుకు కావాల్సిన అనుమతులను కేంద్రం మంజూరుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సదుపాయాల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం పేర్కొనడంతో ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టయింది. కీలకమైన ఈ ఆర్ఆర్ఆర్ పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లాకు రాజధానికి అనుసంధానం పెరగడంతో పాటు ఈ ప్రాంతం పారిశ్రామికంగా, సేవారంగాలపరంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. దీంతో పాటు ఏపీ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా నల్లగొండకు అనుసంధానమయ్యేలా ఒక జాతీయ రహదారిని చేపట్టాలని కేంద్రమంత్రికి ప్రతిపాదనలు సమర్పించారు. ఏపీ రాష్ట్రం కర్నూల్ శివారులోని జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు నుంచి (44వ నెంబర్ జాతీయరహదారి) అలంపూర్- జటప్రోల్- పెంట్లవెల్లి- కొల్లాపూర్- లింగాల- అచ్చంపేట- డిండి- దేవరకొండ- మల్లేపల్లి- నల్లగొండ వరకు 225 కిలోమీటర్ల నూతన జాతీయరహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. వీటితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నల్లగొండ బైపాస్ రోడ్డుకు రూ.700కోట్ల నిధులతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ పనులన్నింటికీ వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించాలని భావిస్తున్నారు.

పలు రహదారులకు శంకుస్థాపనలు

ఉమ్మడి జిల్లాలోని పలు కీలక రహదారుల విస్తరణ, బీటీ నిర్మాణాలకు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. నకిరేకల్-వాడపల్లి, పానగల్-నకిరేకల్, నల్లగొండ-దేవరకొండ రోడ్లను నాలుగు లేన్లుగా మార్చేందుకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా నల్లగొండ-ముశంపల్లి రహదారిని డబుల్‌లైన్‌గా విస్తరించనున్నారు. నల్లగొండ-నర్సింగ్‌భట్ల-కురంపల్లి రోడ్డు, మామిడాల-చిరుమర్తి-మాడుగులపల్లి రోడ్లను డబుల్ రోడ్డుగా, ఇండ్లూరు-చందనంపల్లి రోడ్డుకు, లచ్చుగూడెం-పాల్వాయి రోడ్లకు ఇటీవల మంత్రి శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, బీటీ రెన్యువల్స్ కోసం, డబుల్ రోడ్ల నిర్మాణాల కోసం ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తుండడంతో ఈ పనులన్నీ పూర్తయితే ఉమ్మడి జిల్లాలో రహదారుల పరిస్థితి మెరుగుకానుంది.

నేడు దేవరకొండ నియోజకవర్గంలో రోడ్లకు శంకుస్థాపన

దేవరకొండ, మార్చి 9: దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 10న పలు రోడ్లకు రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో ఉదయం 10.30గంటలకు రూ.4కోట్లతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన, 11.30 గంటలకు సాయిబాబా దేవాలయంలో పూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు రూ.14కోట్లతో చేపట్టనున్న దేవరకొండ పట్టణంలోని డిండి ఎక్స్‌రోడ్డు-మైనంపల్లి బిడ్జివరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నా మనసంతా నల్లగొండ చుట్టూనే



నేనెక్కడున్నా నా మనసంతా నల్లగొండ చుట్టూనే ఉంటుంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జిల్లా అన్ని రంగాల్లో వెనకబడింది. మా హయాంలో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకుతీసుకెళ్లే పనులు చేపడుతున్నాం. రోడ్ల విషయంలో గత ప్రభుత్వం జిల్లాపై వివక్ష చూపింది. దాన్ని సరిచేసేలా అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు,విస్తరణ చేపడుతున్నాం.నల్లగొండ బైపాస్‌రోడ్డుకు రూ.700కోట్లతో త్వరలో శంకుస్థాపన చేస్తాం. ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన రోడ్ నెట్‌వర్క్ ఉండేలా కృషిచేస్తున్నాం.

\- కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి

రామలింగేశ్వరుడికి రథోత్సవం



యాదగిరికొండపైన శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పర్వత వర్ధిని సమేతంగా రామలింగేశ్వరస్వామికి దివ్య విమానరథోత్సవం వైభవంగా నిర్వహించారు.

•7లో..

ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పీఆర్సీ

రీజియన్‌లో 2,479మందికి లబ్ధి

నల్లగొండ, మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. పీఆర్సీతో కూడిన వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రీజియన్ పరిధిలో మొత్తం 2,479మంది ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి దీంతో లబ్ధి చేకూరనుంది. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, ఏఈలు, అసిస్టెంట్ మేనేజర్లు, డిపో మేనేజర్లు, క్లర్క్‌లు, పెయింటర్లు, ఆర్టీసీ కానిస్టేబుళ్లు, ఎలక్ట్రీషియన్లు వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది. నల్లగొండ రీజియన్ పరిధిలో మొత్తం ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. నల్లగొండ డిపో పరిధిలో 497మంది ఉద్యోగులు, దేవరకొండ డిపో పరిధిలో 428మంది, కోదాడ డిపో పరిధిలో 276మంది, యాదగిరిగుట్ట పరిధిలో 429మంది ఉద్యోగులు ఉన్నారు. అదేవిధంగా సూర్యాపేట డిపో పరిధిలో 398మంది, మిర్యాలగూడ డిపో



పరిధిలో 379మంది, నార్కట్‌పల్లి డిపో పరిధిలో 72మంది ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. టీఎస్ ఆర్టీసీలో పేస్కేల్ ప్రతీ నాలుగేళ్లకోసారి సవరిస్తారు. ప్రస్తుతం 2017పేస్కేల్‌తో పాటు 2021 పేస్కేల్ సవరించాల్సి ఉంది. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2017 పేస్కేల్‌ను సవరించి 21శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేసేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగులతో పాటు 2017 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు కూడా ఈ ఆర్థిక ప్రయోజనం పొందనున్నారు.

లక్ష్మీనృసింహుడికి పోచంపల్లి వస్త్రాలు



చేనేత వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న యాదగిరిగుట్ట ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్‌శర్మ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 9: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవికి పుట్టింటివారుగా భావించే పద్మశాలీయులు సమర్పించే పోచంపల్లి చేనేత ఇక్కత్ పట్టుచీరలు, స్వామివారికి పంచెల తయారీని స్థానిక పద్మశాలీ మహాజన సంఘం చేపట్టింది. ఈ సందర్భంగా శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, ఏఈవో శ్రవణ్‌కుమార్, సూపరింటెండెంట్ శేఖర్‌నాయక్ వస్త్రాల తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, ఉపాధ్యక్షులు బోగ నరసింహ, అం కం మురళీ, కార్యదర్శి భారత బాలరత్నం, సహాయ కార్యదర్శి కడవేరు చంద్రమౌళి, కోశాధికారి సంగెం చంద్రయ్య, సభ్యులు గంజి అంజయ్య, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, చేనేత కళాకారుడు మేకల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్య వాటా కల్పించాలి



అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పాదయాత్ర బృందం సభ్యులు

భువనగిరి టౌన్, మార్చి 9: జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్య వాటా కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ రాష్ట్ర నేత సాయిని నరేందర్ అన్నారు. పలు డిమాండ్ల సాధనకు చేపట్టిన పాదయాత్ర 9వ రోజు భువనగిరి చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యంతోనే ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ముందుగా అమరవీరుల స్మారక స్తూపం, తెలంగాణ కళాకారిని బెల్లి లలిత సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మేకపోతుల నరేందర్, బత్తుల సిద్దేశ్వర్, ఎర్ర శ్రీహరి, కొంగ నరహరి, భువనగిరి శ్రీనివాస్, పటేల్ వనజ, పటేల్ వనిత, భిక్షపతి, సింగారపు అరుణ, విమల, విశ్వపతి, చిన్న శ్రావణ్‌కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు అంబేడ్కర్



గోపరాజుపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

వలిగొండ, మార్చి 9: ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ అని కవి, రచయిత జయరాజు, బౌద్ధ భిక్షువు సారిపుత్ర బంతె అన్నారు. శనివారం మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో జై భీమ్ సేన ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి సమాజంలో పౌరులు ఎదుర్కొంటున్న కుల నిర్మూలనకు అంబేడ్కర్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. యువత చదువుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు కలెక్టర్ బి.వెంకటయ్య, రిటైర్డ్ పోలీస్ అధికారి కంచి ముత్తయ్య, అంబేడ్కర్‌వాది ఆనంద్, మునుగోడు పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ వల్లమల్ల రఘుపతి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కీసర్ల ఉపేంద్ర, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి భక్తులకు మరోసారి నిరాశే

● పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్‌కు భువనగిరిలో స్టాప్ ఇవ్వని రైల్వే శాఖ



భువనగిరి టౌన్, మార్చి 9: కలియుగ దైవం.. శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే భువనగిరి పరిసర ప్రాంతాల భక్తులను రైల్వే శాఖ నిరాశపరిచింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ప్రతీ రోజు రాత్రిపూట ప్రయాణించే పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు భువనగిరి రైల్వేస్టేషన్‌లో స్టాప్ ఇవ్వాలని భక్తులు దీర్ఘకాలంగా డిమాండ్‌చేస్తున్నారు. ఇందుకనుగుణంగా రైల్వేస్టేషన్‌లో ఆందోళనలు చేయడం, తనిఖీలకు వచ్చే రైల్వే ఉన్నతాధికారులకు, భువనగిరి పర్యటనకు వచ్చే కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. పైగా భువనగిరి నుంచి ఎంపీగా పోటీచేసే పార్టీలకతీతంగా అభ్యర్థులందరూ పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్ స్టాపేజీపై హామీ ఇవ్వడం కూడా అలవాటుగా మారింది. అయితే రైల్వేశాఖ శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో పద్మావతి రైలుతోపాటు పలు రైళ్లకు ప్రకటించిన తొమ్మిది స్టాప్‌ల జాబితాలో భువనగిరి రైల్వేస్టేషన్‌కు చోటు దక్కలేదు.కానీ ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ రైల్వేస్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ ఇచ్చారు. అయితే ప్రతీ రోజు సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 5గంటలకు సికింద్రాబాద్‌లో ప్రారంభమై 6 గంటల 5 నిమిషాలకు భువనగిరికి,రాత్రి 9గంటల 40 నిమిషాలకు తిరుపతికి చేరుతుంది. దీంతో పగలు రాత్రి, కలిసి సుమారు 16 గంటలు ప్రయాణించాల్సి ఉంటుంది. పైగా రాత్రిపూట తిరుమల తిరుపతిలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరికొందరు ఇతర రైళ్లలో తిరుపతికి వెళ్లేందుకు బీబీనగర్, సికింద్రాబాద్, కాచీగూడ, జనగాం, కాజీపేట రైల్వేస్టేషన్లకు వెళ్తున్నారు. ఈనేపథ్యంలో సికింద్రాబాద్‌లో సాయంత్రం 6.40గంటలకు ప్రారంభమై తిరుపతికి మరుసటి రోజు తెల్లవారుజామున చేరే పద్మావతి రైలు భువనగిరి రైల్వే స్టేషన్‌లో ఆపాలని భక్తులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ రైల్వే శాఖ పెడచెవిన పెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రతీ రోజు భువనగిరి పరిసరాల నుంచి తిరుపతికి పలు రైళ్లలో 200మందికి పైగా భక్తులు వెళ్లి వస్తుంటారు. పద్మావతి రైలుకు భువనగిరిలో స్టాప్ ఇస్తే ప్రయాణ సమయం ఆదా అయి అధిక మంది భువనగిరినుంచి పద్మావతి రైలులో తిరుపతికి రాకపోకలు సాగించే అవకాశం ఉండేది. కానీ రైల్వే శాఖ వైఖరితో భక్తులు యథావిధిగా ఇక్కట్లును ఎదుర్కోవాల్సిన దుస్థితి. కాగా సికింద్రాబాద్ తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు నూతనంగా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో స్టాప్ ఇవ్వడం ఆప్రాంతవాసులకు ఊరడింపు కలిగిస్తున్న అంశం.

మిర్యాలగూడలో ఆగనున్న వందేభారత్ రైలు

ట్విట్టర్‌లో పేర్కొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మిర్యాలగూడ టౌన్, మార్చి 9: సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలు ఇకపై మిర్యాలగూడలో ఆగనుంది. కేంద్ర పర్యాటక శాఖమంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్(సికింద్రాబాద్), గుంటూరు రైల్వే డివిజన్ల పరిధిలో నడిచే పలు రైళ్లకు రాష్ట్రంలోని 14 స్టేషన్లలో రైల్వేశాఖ స్టాపులు ఇచ్చినట్లు ట్వీట్ చేశారు. ఆయా రైళ్లలో వందేభారత్ (ట్రైన్ నెం. 20701/20702) రైలుకు మిర్యాలగూడ స్టేషన్‌లో స్టాప్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రేపల్లే- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెం.17646) రైలుకు రామన్నపేటలో స్టాప్ ఇచ్చినట్లు ట్విట్టర్ వేదికగా కేంద్రమంత్రి వెల్లడించడంతో రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన రైల్వేశాఖ ట్రైన్ టికెట్ల ధరలు తగ్గించడంతోపాటు పలు స్టేషన్లలో అదనంగా స్టాపులు ఇవ్వడంపై నెటిజన్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అయితే ఈ విషయమై అధికారికంగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

చేనేత పథకాలకు నిధులు విడుదల చేయాలి



గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

చౌటుప్పల్ టౌన్, మార్చి 9: చేనేత పథకాలకు నిలిపి వేసిన నిధులను వెంటనే విడుదల చేయాలని చేనేత నాయకులు డిమాండ్‌చేశారు. చేనేత సమస్యలను పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని శనివారం చేనేత నాయకులు చౌటుప్పల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. త్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్ర, నగదు బదిలీ, చనిపోయిన కార్మికులకు బీమా పథకాలకు నిధులు విడుదల చేయకపోవడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ పథకాలకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు కందకట్ల భిక్షపతి, గోశిక చక్రపాణి, గుర్రం నర్సింహ, వనం ధనుంజయ్య, గోశిక స్వామి, గంజి మురళీధర్, పున్న వెంకటేశం, దోర్నాల సత్తిబాబు, బత్తుల చంద్రయ్య పాల్గొన్నారు.

'రావి' పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

» సినీ నిర్మాత జైహింద్‌గౌడ్
» రావి నారాయణరెడ్డి ఇంటి ఎదుట దీక్షలు



బొల్లేపల్లిలో రావినారాయణరెడ్డి ఇంటి ఎదుట దీక్ష చేస్తున్న సినీ నిర్మాత జైహింద్‌గౌడ్

భువనగిరి రూరల్, మార్చి 9: రావి నారాయణరెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, యాదాద్రి భువనగిరి జిల్లాకు రావి నారాయణరెడ్డి జిల్లాగా నామకరణం చేయాలని సినీ నిర్మాత, నవ సంఘర్షణ సమితి ఆల్ ఇండియా చైర్మన్ పంజాల జైహింద్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని బొల్లేపల్లిలో స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ పార్లమెంటేరియన్ రావి నారాయణరెడ్డి ఇంటి ఎదుట ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వందెకరాల స్థలంలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి, జిల్లాకు రావి పేరు పెట్టాలన్నారు. అదేవిధంగా జాతీయ పార్టీలు బీసీలకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావి వేణుగోపాల్‌రెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు సందెల శ్రీనివాస్, కనుకుంట్ల బాబురావు, బాలకృష్ణ, అమ్మదాస్, తదితరులు ఉన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

పరారీలో నిందితుడు ● సూర్యాపేట జిల్లాలో ఘటన

నేరేడుచర్ల, మార్చి 9: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఓ మైనర్‌పై లైంగికదాడి జరిగింది. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలానికి చెందిన 14ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన షేక్ సుభాని(45) అనే వ్యక్తి లైంగిక దాడి చేసి పరారయ్యాడు. బాధితురాలి తల్లి వరంగల్ జిల్లా చెందిన ఓ వ్యక్తితో 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకుంది. రెండేళ్లకి కుమార్తె పుట్టింది. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుంది. తర్వాత కుమార్తెను తీసుకొని బతుకుదెరువు కోసం కోదాడకు వచ్చింది. కోదాడలో నివాసముంటున్న ఆమెకు నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ లారీడ్రైవర్ పరిచయమయ్యాడు. అతడిని వివాహం చేసుకుంది. ఏడాదిగా అద్దె ఇంట్లో కుమార్తె, భర్తతో కలిసి ఉంటోంది. వీరు ఉండే పక్క ఇంట్లోనే పెయింటింగ్ పని చేసే షేక్ సుభాని నివాసముంటున్నాడు. సుభాని కొంతకాలంగా భార్యతో విభేదించి దూరంగా ఉంటున్నాడు. నేరేడుచర్లలో మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. బాధితురాలు, షేక్ సుభాని ఇరువురు కుటుంబాలు ఒకే ఇంట్లో పక్కపక్క గదుల్లో అద్దెకు ఉంటున్నారు. షేక్ సుభానితో సహజీవనం చేస్తున్న మహిళతో శుక్రవారం రాత్రి ఘర్షణ జరగడంతో ఆమె శుక్రవారం రాత్రి సదరు బాలిక ఇంట్లో పడుకుంది. సుభాని మాత్రం అద్దె ఇంట్లోనే ఉన్నాడు. సుభానితో సహజీవనం చేస్తున్న మహిళకు ఇదే వీధిలో సొంత ఇల్లు ఉంది. ఉదయం బాలిక, తన తల్లితో కలిసి సుభాని సహజీవనం చేస్తున్న మహిళ ఇంటికి శనివారం ఉదయం వెళ్లారు. ఇంటికి వెళ్లి అన్నం పెట్టుకు రమ్మని తల్లి చెప్పడంతో బాలిక ఒంటరిగా వారు ఉంటున్న అద్దె ఇంటికి వచ్చింది. అది గమనించిన సుభాని ఆమె ఇంట్లోకి వెళ్లి బాలికపై బలవంతంగా లైంగిక దాడి చేసి గోడదూకి పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పడంతో వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని హుజూర్‌నగర్ సీఐ చలమంద రాజు పరిశీలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



భువనగిరిలో బాలుడిని తల్లి ఆసియాబేగానికి అప్పగిస్తున్న అధికారులు

భువనగిరి టౌన్ / భువనగిరి అర్బన్, మార్చి 9: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడు ఎట్టకేలకు శనివారం అమ్మ చెంతకు చేరాడు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమారం జాతరలో పోలీసులకు దొరికిన 11 ఏళ్ల మానసిక దివ్యాంగుడైన అబూబాకర్‌ను శనివారం అధికారులు తల్లికి అప్పగించడంలో కథ సుఖాంతమైంది. అధికారులు పేర్కొన్న వివరాల ప్రకారం.. హైదరాబాద్ బండ్లగూడలో నివాసం ఉంటున్న ఆసియాబేగం భర్తతో విడాకులు తీసుకుంది. ఆమె కుమారుడు అబూబాకర్ మానసిక దివ్యాంగుడు. అయితే ఈ నెల 5వ తేదీన అతడు ఇంటి నుంచి తప్పి పోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించపోకపోవడంతో అదే రోజు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటి నుంచి తప్పిపోయిన బాకర్ బీబీనగర్ మండలం పడమటి సోమవారం జాతరలో ఒంటరిగా సంచరించడాన్ని గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకొని జిల్లా బాలల పరిరక్షణ సమితికి అప్పగించారు. అయితే బాలుడి వివరాలు చైల్డ్‌హెల్ప్‌లైన్, సోషల్ మీడియాలో వెల్లడించడంతో మిస్సింగ్ కేసుగా దర్యాప్తు చేస్తున్న బండ్లగూడ పోలీసులు గమనించి ఆరా తీయడంతో అబూబాకర్‌గా నిర్ధారణ అయింది. ఈ మేరకు జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.సైదులు, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 కోఆర్డినేటర్ దశరథ పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వ హించారు. లింగోద్భవ వేళ స్వామి, అమ్మ వార్ల మహిమలను వివరిస్తూ అర్చకులు కల్యాణ తంతును జరి పించారు. ఉపవాసంతో పాటు జాగరణ చేసిన భక్తులు కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించారు. ఉమ్మడి జిల్లాలో పెద్దజాతరల్లో ఒకటైన మేళ్ల చెర్వులో ప్రభల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అదేవిధంగా ఎద్దుల పందేలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రి దేవాలయంలో, నేరేడుచర్లలోని సోమప్ప ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు.

● భక్తుల జాగరణతో ఆలయాలు కిటకిట ● మేళ్లచెర్వులో ఆకట్టుకున్న కల్యాణోత్సవం, ప్రభల ప్రదర్శన ● కొనసాగుతున్న ఎద్దుల పందేలు




మేళ్లచెర్వు జాతర సందర్భంగా ప్రభలను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాజరైన భక్తులు, విద్యుద్దీపాల ప్రభలు

మేళ్లచెర్వు, మార్చి 9 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో మహాశివరాత్రి జాతర సందర్భంగా మండలకేంద్రం జనసంద్రమైంది. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలను తిలకించడానికి, తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం, ఆలయ ప్రాంగణం మొత్తం జనసంద్రంగా మారింది.

కన్నులపండుగా కల్యాణం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వయంభూ శంభులింగేశ్వరస్వామి వారికి, ఇష్టకామేశ్వరి అమ్మవారికి అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కన్నులపండువగా కల్యాణ తంతు నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను రాత్రి 2 గంటలకు స్వామి వారిని నంది వాహనంపై, అమ్మవారిని పల్లకిలో ఊరేగింపు తీసుకెళ్లారు. మొదటగా ఎదుర్కోళ్ల మహోత్సవం జరిగింది. అనంతరం కల్యాణ మండపానికి తీసుకెళ్లి, అశేష భక్త జనసమక్షంలో ముత్యాల తలంబ్రాలతో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నంది వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉదయం నాలుగ గంటలకు ప్రధాన ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ మహేంద్రకుమార్, ఈవో నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులు శనివారం స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

జాతరకు పెద్దసంఖ్యలో భారీగా తరలిరావడంతో శుక్రవారం అర్ధరాత్రి ఆలయ ప్రాంగణంతో పాటు మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు గుడికి, గ్రామానికి మధ్యలోని ఎన్ఎస్పీ కాల్వల బ్రిడ్జిలపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. పోలీసుల అప్రమతతో ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు ప్రారంభం

జాతర సందర్భంగా అట్టహాసంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను సీఐ రజితారెడ్డితో కలిసి పోశం నర్సిరెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. మొదటి రోజు ఎనిమిది మంది మహిళ, పురుషుల జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. మొదటగా సూర్యాపేట, రంగారెడ్డి మహిళా జట్లు తలబడ్డాయి. కార్యక్రమంలో ఎంపీపీ పద్మ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఎద్దుల పందేలు రెండోరోజు శనివారం ఉదయం నుంచే కొనసాగుతున్నాయి.

పరమశివుడి ఆశీస్సులుండాలి: మంత్రి

ప్రతీ ఒక్కరికి పరమశివుడి ఆశీస్సులుండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతర సందర్భంగా రూ.15 లక్షల వరకు వెచ్చించి వివిధ వర్గాల వారు విద్యుద్దీపాల ప్రభలను ఏర్పాటు చేశారు. ఏడు ప్రభలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1994 నుంచి జాతరకు క్రమంతప్పకుండా హాజరవుతున్నానని, ఆలయంలో మౌలిక సదుపాయల కల్పన కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయించానన్నారు. ఇదిలా ఉండగా 100, 110అడుగుల ఎత్తు వరకు ఏర్పాటుచేసిన ప్రభలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఛాయాసోమేశ్వరాలయంలో

నల్లగొండ కల్చరల్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో శివపార్వతుల కల్యాణవేడుకలను వైభవంగా నిర్వహించారు. పానగల్లులోని శైవక్షేత్రాలైన ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలు, నల్లగొండలోని వీటీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, షేర్‌బంగ్లా సంతోషిమాత ఆలయం, బీట్ మార్కెట్ శ్రీరామకోటిస్థూప దేవాలయంలో కన్నుల పండువగా కల్యాణాన్ని నిర్వహించారు. ఛాయా సోమేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను అగ్నిగుండాల్లో ఊరేగించారు.

అనంతరం అభిషేకాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వింజమూరి లక్ష్మి బృంద శాస్త్రీయ సంగీతాలాపన కార్యక్రమం జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో ఆశీనులను చేసి కోనేరులో తెప్పోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, బండారు ప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, డీఎస్పీ శివరాంరెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, పర్వతరెడ్డి, అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఛాయాసోమేశ్వరాలయంలో అగ్నిగుండాల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



కబడ్డీ పోటీల సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ రజితారెడ్డి

మట్టపల్లి క్షేత్రంలో

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ మూర్తులకు పురవీధుల్లో గరుడవాహన సేవ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మట్టపల్లి పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేణుగోపాలస్వామి ఆలయంలో

నార్కట్‌పల్లి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. నార్కట్‌పల్లి, గోపలాయపల్లి, ఏపీలింగోటం, అక్కెనపల్లి, అమ్మనబోలు గ్రామాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. నార్కట్‌పల్లిలోని బస్టాండ్ వెనుక ఉన్న పార్వతీ రామలింగేశ్వరస్వామి, మాండ్ర రహదారిలోని పురాతన సిద్ధ రామలింగేశ్వరాలయం, అక్కెనపల్లిలోని పురాతన బ్రహ్మసూత్రం గల శివాలయం, ఏపీలింగోటం, హరిహర క్షేత్రం గోపలాయపల్లిలలో శివపార్వతుల కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లిలోని రామలింగేశ్వరాలయంలో ఎదుర్కోలు రథోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పూజారులు నిడిగొండ భగవాన్ శర్మ, పుట్టపాక మురళీధర్‌రావులచే పూజాధికాలు జరుపబడ్డాయి. ఈ ఉత్సవాల్లో ఆలయ చైర్మన్‌లు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి, పుల్లెంల శ్రీనివాస్ మంగమ్మ దంపతులు భక్తులు పాల్గొన్నారు.

పిల్లలమర్రి ఆలయంలో

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట జిల్లాకేంద్ర పరిధిలోని పురాతన శైవాలయం పిల్లలమర్రి ఎర్రకేశ్వరాలయం ఎదుట శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నామేశ్వర స్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహలను మంగళవాయిద్యాల నడుమ, మహిళల కోలాటాల మధ్య కల్యాణమండపానికి ఉత్సవవిగ్రహాలను ఊరేగింపుతో తీసుకువచ్చారు. ఎదుర్కోళ్ల కార్యక్రమం అనంతరం శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని అర్చకులు హరిప్రసాద్‌శర్మ, మనగలేటి సంతోష్ శర్మ ఘనంగా నిర్వహించారు. జాగరణ కోసం పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. అదేవిధంగా ఎండ్లపల్లి గ్రామంలో స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో లింగాయత్ లింగ బలిజ పూజారుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలమర్రి దేవాలయ కమిటీ చైర్మన్ కోట్ల సైదులుగౌడ్, డైరెక్టర్లు, యండ్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.



పిల్లలమర్రిలో కల్యాణోత్సవ ఘట్టం

నేరేడుచర్ల సోమప్ప ఆలయంలో

నేరేడుచర్ల: మహాశివరాత్రి సందర్భంగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమప్ప దేవాలయం, నేరేడుచర్ల, దిర్శించర్ల శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాచీన సోమప్ప దేవాలయంలో పూజారి శ్రీనివాసశాస్త్రి, వేద పండితులు సాగి నర్సింహమూర్తి, దుర్గాప్రసాద్ శర్మ, ఇరువంటి శ్రీపాదశర్మ ఆధ్వర్యంలో రంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మూడు రోజులు సెలవు దినాలు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శుక్రవారం రాత్రి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ దగ్గరుండి పర్యవేక్షించారు. నేరేడుచర్ల శివాలయంలో కల్యాణానికి భారీగా తరలివచ్చారు. ఆలయ పూజారి ఉగ్రదండి శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. రాచకొండ కోటేశ్వరావు, కొణతం సీతారాంరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దాతలు, వ్యాపార వేత్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



సోమప్ప ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు, హాజరైన భక్తులు



దివ్యాలంకార శోభితుడు రామలింగేశ్వరుడిని సేవలో రథం వద్దకు తీసుకువస్తున్న అర్చకులు

వైభవంగా దివ్యవిమాన రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి9: యాదగిరికొండపై అనుబంధ ఆలయం పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరుడు కొలువుదీరిన శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం లక్షబిల్వార్చనలు, రాత్రి వేళ దివ్యవిమాన రథోత్సవ ఘట్టాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడిని ఆరాధించిన అర్చకులు నిత్యహవనం, శివపంచాక్షరీ, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, వేద ఇతిహాస పారాయణ పఠనం చేశారు. అనంతరం ప్రధానాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని కొలుస్తూ శివపార్వతుల సహస్రనామ పఠనాలతో గంట పాటు లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజాకైంకర్యాలు, వేద పారాయణ పఠనం, యాగశాలలో నిత్యలఘు పూర్ణాహుతి పర్వాలను నిర్వహించారు.

యాత్రాజనుల పూజల సందడి



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడి సన్నిధిలో శనివారం యాత్రాజనుల పూజల సందడి నెలకొంది. మహాశివరాత్రి పర్వదినం కావడంతో యాత్రాజనులు పెద్దసంఖ్యలో క్షేత్ర సందర్శనకు తరలివచ్చారు. యాత్రాజనుల సంచారంతో కొండకింద కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారి ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాలకు అర గంట సమయం పట్టినట్టు, సుమారు 20వేల మందికి పైగా యాత్రికులు ఇష్టదైవాలను దర్శించుకున్నట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,00,487 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్యపూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను నిర్వహించారు.

కన్నుల పండువగా రథోత్సవం

యాదగిరికొండపైన శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రామలింగేశ్వరస్వామి దివ్య విమానరథంపై భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. ఆలయ బాహ్యప్రాకారంలో స్వామివారి దివ్యవిమానరథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో పర్వవర్ధినీ అమ్మవారిని, రామలింగేశ్వరుడిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక సేవలో తీర్చిదిద్దారు. ప్రధానాలయంలో ఊరేగించి బాహ్యప్రాకారంలోని దివ్యవిమాన రథం వద్ద ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దిన పురోహితులు, అర్చకబృందం రథాంగబలి, దిష్టికుంభ పూజలను నిర్వహించారు. అనంతరం దివ్యవిమాన రథంపై కల్యాణమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం దివ్యవిమాన రథాన్ని శివాలయ ప్రాకార మండపంలో భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఊరేగింపు వేడుకలు నేత్రపర్వంగా కొనసాగాయి. ఈ విశేష పర్వాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహోత్సవాల్లో రథోత్సవ విశిష్టత


నూతన కల్యాణపరులైన శివపార్వతులను శివరాత్రి మహోత్సవాల్లో దివ్యవిమాన రథంలో అధిష్ఠింపజేసి ఊరేగింపు నిర్వహించడం సంప్రదాయం. అర్ధనారీశ్వర రూపంలో పార్వతీ, పరమేశ్వరులను ఏకరూపంలో దర్శనం కలిగించే ఈ రథోత్సవ ఘట్టం శివరాత్రి మహోత్సవాల్లో మహోత్తరమైందని, అద్వైత జ్ఞానప్రకాశముని శివ పురాణం దేవస్థాన ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణ శర్మ వివరించారు. రథమనే దేహ భ్రాంతిని విడనాడి జ్ఞాన స్వరూపుడైన శివుడిని ఆశ్రయిస్తే కైవల్యం ప్రాప్తిస్తుందని వేదాలు తెలుపుతున్నాయని ఆయన అన్నారు.

నవవధువును బలిగొన్న కులాంతర వివాహం

భువనగిరి రూరల్, మార్చి 9: ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న 19 రోజులకే అత్తగారి వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ శనివారం మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొండూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ వీ.సంతోష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చీమలకొండూరు గ్రామానికి చెందిన బీట్కూరి మనోహర్, అదే గ్రామానికి చెందిన పల్లెర్ల భూమిక(19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వేర్వేరు కులాలు కావడంతో మనోహర్ కుటుంబసభ్యులు వీరి వివాహానికి అంగీకరించలేదు. అయితే ఫిబ్రవరి 17న యాదగిరిగుట్టలో మనోహర్, భూమిక కులాంతర వివాహం చేసుకున్నారు. కాగా, వివాహం అనంతరం వారిద్దరూ చీమలకొండూరులోని మనోహర్ ఇంటికి వచ్చారు. కులం తక్కువదానివి అంటూ అత్త స్వరూప సూటిపోటి మాటలతో వేధిస్తుండటంతో విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు పంచాయితీ పెట్టి ఇరు కుటుంబాలను సముదాయించారు. అయితే అత్తతో పాటు భర్త కూడా వేధిస్తున్నాడని భూమిక మనోవేదనకు గురైంది. ఈ నెల 2వ తేదీన అదే గ్రామంలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. అత్తింటి వ్యవహారశైలిపై తీవ్ర మనస్తాపంతో ఉన్న భూమిక ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. బంగ్లాపై దుస్తులు ఆరవేస్తున్న తల్లి రేణుక అనుమానంతో కిందికి వచ్చి కిటికీలోంచి గదిలో చూడగా భూమిక తాడుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారిని కేకలు వేస్తూ పిలిచి తలుపులను పగులగొట్టి లోపలికి వెళ్లేలోగా భూమిక అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను హుటాహుటిన భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు అక్కడ చికిత్స పొందుతూ భూమిక శనివారం మృతి చెందింది.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న భూమిక బంధువులు



భూమిక(ఫైల్‌ఫొటో)

భూమిక మృతదేహంతో ఆందోళన

అత్తింటి వేధింపులతోనే భూమిక ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొంటూ ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆమె మృతదేహంతో మనోహర్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు.ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న రాచకొండ కమిషనరేట్ భువనగిరి జోన్ ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ బందోబస్తుతో గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భూమిక కుటుంబసభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరికి తరలించారు. రెండు గంటల పాటు ఆందోళన జరిగింది. భూమిక తల్లి రేణుక ఫిర్యాదు మేరకు ఆమె భర్త మనోహర్, అత్త స్వరూపపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

మఠంపల్లిలో మెడికల్ దుకాణ లైసెన్స్ రద్దు

మఠంపల్లి, మార్చి 9 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో మత్తు మందులు విక్రయించిన దుర్గాభవానీ మెడికల్ షాప్ లైసెన్స్ రద్దు చేస్తూ యజమాని రమావత్ రవీందర్ నాయక్‌కు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ వెంకటరావు, ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా దాడులు, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దాడుల్లో దుర్గాభవానీ మెడికల్ యాజమాని పట్టుబడ్డాడని, కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు మత్తు మందుల వ్యాపారం కోసం ఓ ముఠాగా పనిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ముఠా వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు ఉన్నా వదిలేది లేదన్నారు. వారం రోజుల్లో మరెన్నీ దాడులు, విచారణ కొనసాగించి అందరి వివరాలు వెల్లడిస్తామన్నారు.

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన గమనించాలి

మత్తుమందుకు బానిసలై యువకులు, విద్యార్థులు తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారని, తల్లిదండ్రులు ప్రతి రోజూ పిల్లల ప్రవర్తనను గమనించాలని తహసీల్దార్ మంగా రాథోడ్, కోదాడ ఎక్సైజ్ ఎస్ఐ గోవర్దన్‌లు సూచించారు. మత్తు మందులకు అలవాటు పడితే విద్యార్థులు సైకోలా మారుతారని తెలిపారు. అంతదూరం రాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్లో మార్పులు కనబడితే కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్తే ఆ తర్వాత కారణాలను తెలుసుకొని వారి భవిష్యత్‌ను కాపాడే వీలుంటుందని సూచించారు.

వీఆర్ఏ ఆత్మహత్య

డిండి, మార్చి 9 : నల్లగొండ జిల్లా డిండి మండలంలో వీఆర్ఏ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన రాగడపల్లి కృష్ణయ్య(70) గ్రామంలో వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. కృష్ణయ్య ఉద్యోగం చేస్తున్నందున తమకు రూ.12లక్షలు ఇవ్వాలని పాలివారు డిమాండ్ చేశారు. రూ.12లక్షలు తెచ్చి ఇవ్వలేని కృష్ణయ్య మనస్థాపంతో ఈనెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. కృష్ణయ్య మృతికి కారణమైన రాగడపల్లి విజయ్, రాగడపల్లి ధనంజయతోపాటు మరో ఎనిమిది మంది పైనా కృష్ణయ్య కుమారుడు పెద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా వారికి వివాహాలు అయ్యాయి.

ఆధ్యాత్మిక కోలాహలం

మహాశివరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక కోలాహలం వెల్లివిరిసింది. శివపార్వతుల కల్యాణాలు వైభవంగా కొనసాగాయి. పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను 'హర హర మహాదేవ.. ఓం నమఃశివాయ' శబ్దాల మధ్య ఊరేగించారు. అగ్నిగుండాల కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, మార్చి9: జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలోని ఆలయాలలో శనివారం శివరాత్రి ముగింపు పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో శివపార్వతులను పల్లకీల్లో ఊరేగించారు. కార్యక్రమాలలోఆలయ కమిటీ చైర్మెన్లు రత్నపురం శ్రీశైలం, కాలేరు లక్ష్మణ్‌రావు, కె.సహదేవ్, దూసరి చంద్ర శేఖర్‌గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బలరాం పాల్గొన్నారు.

● ఆధ్యాత్మిక కేంద్రంగా శివభక్తి శిరిడిసాయి ఆశ్రమం విరాజిల్లుతోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి శిరిడిసాయి ఆశ్రమం రమణేశ్వరంలో ప్రతిష్ఠించిన వివిధ దేవత విగ్రహాలు, శివలింగాలను ఆయన సందర్శించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సువర్ణ లింగానికి క్షీరాభిషేకం చేశారు. సిద్ధగురు రమణమహర్షి, ఆశ్రమ పర్యవేక్షకుడు బలరాం, మాజీ సర్పంచ్ శివరాజ్‌గౌడ్, శేఖర్, భరత్‌గౌడ్ ఉన్నారు. నమాత్‌పల్లి శివారులోని స్వయంభూ శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ స్వాగతం పలికారు. ఆలయ ఉపాసకులు బత్తిని రాములు గౌడ్, పూజారి పవన్‌కుమార్, జంగారెడ్డి, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కళ్యాణాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

మోత్కూరు : మండలంలోని ముశిపట్ల గ్రామంలో శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామికి అత్యంత వైభవంగా అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. ముశిపట్లలోని బుగ్గరామన్న గుట్టపై వెలిసిన శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామికి శుక్రవారం రాత్రి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం శివపార్వతులను రాత్రంతా ముశిపట్ల గ్రామంలో ఊరేంచారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు, మహిళలు మంగళ హారతులు పట్టి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఉదయం పల్లకిలో శివపార్వతులను మోస్తూ, ప్రభతో భక్తులు ఓం నమఃశివాయ అంటూ అగ్నిగుండం నుంచి నడిచి వెళ్లారు. భక్తులకు దాతలు అన్నదానం చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, జడ్పీటీసీ గోరుపల్లి శారదసంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పైళ్ల విజయ నర్సిరెడ్డి, పైళ్ల సోమిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజారి మోత్కూరు ప్రదీప్‌శర్మ కల్యాణం నిర్వహించారు.

వలిగొండ: మండలంలోని రెడ్లరేపాక గ్రామంలోని భవానీశంకర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో దేవతామూర్తులను అదిష్ఠింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణ తంతును నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామంలో పార్వతీ పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీపరమేశ్వరులకు కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్ పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, వైస్‌చైర్మన్ కట్ట దశరథరెడ్డి, కాంగ్రెస్ మండల సిరిగిరెడ్డి మల్లారెడ్డి, అధ్యక్షుడు సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాపోలు నరసింహ చేనేత, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు అప్పం రామేశ్వరం, మాజీ సర్పంచ్ మార్యాల బాస్కర్, అప్పం లక్ష్మీనరసింహ, పాలకవర్గ సభ్యులు మిర్యాల రామలింగం ఉన్నారు. కాగా నిదానపల్లి గ్రామంలో మల్లన్నగుట్టపై వెలసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో గణపతి పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయ సముదాయంలో అన్నపూర్ణ దేవి- కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, దేవస్థాన కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, డైరెక్టర్లు పి.శ్రీలత, గుర్రం వెంకటేశం, తూర్పాటి నర్సింహ్మ, కె.చంద్రశేఖర్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు పి.శ్రీధర్‌బాబు, కామిశెట్టి శైలజ, తాడూరు పరమేష్, మంచికంటి భాస్కర్, ఉత్సవ నిర్వాహకులు ఉప్పల కృష్ణ, అశోక్ కుమార్, కేదారీ పాల్గొన్నారు. లింగోజీగూడలోని శివ మహాదేవాలయంలో ఉమా మహేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీఎన్.రెడ్డి, దేవస్థానం చైర్మన్ బండమీది ఎల్లయ్య, కౌన్సిలర్ బండమీది మల్లేశ్, మాజీ సర్పంచ్ ఊదరి నర్సింహ, మారుపాక నర్సింహ, ఎర్రగోని నర్సింహ, లింగస్వామి పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని మహదేవ్‌పూర్ అక్కన్న మాదన్న ఆలయాల్లో కొలువైన రుక్మిణీసత్యభామ సతీసమేత వేణుగోపాల స్వామి కల్యాణమహోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. చిన్నరావులపల్లిలో కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి రథోత్సవ కన్నుల పండువగా సాగింది. అక్కన్న మాదన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొట్టోళ్ల శ్యాంగౌడ్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో సురకంటి సత్తిరెడ్డి, గోళి నరేందర్ రెడ్డి, గడ్డం బాలకృష్ణ గౌడ్, కాసుల ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.


బీబీనగర్: మహదేవపూర్‌లో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజాపేట: మండలంలోని చల్లూరు, బొందుగుల, రాజాపేట, సింగారం, రఘునాథపూర్ గ్రామాల్లో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సింగారంలో పెద్దపటం వేశారు. మండలంలోని పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాల్లో భాగంగా శతఘటాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ చైర్మన్ కుడికాల భిక్షపతి, నాయకులు కడవేరు వెంకటేశం, మెరుగు యతినందం, అంకం పాండు, పొట్టబత్తిని యాదగిరి, ధనుంజయ, కృష్ణ, లంగారు సాయి పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని నల్లవీరభద్రస్వామి దేవాలయం రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 101 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను రథోత్సవంపై ఊరేగించారు. కవిడె ఇందిర ఆధ్వర్యంలో భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, కౌన్సిలర్ మోటె రజిత రాజు, గునిగంటి వెంకటేష్‌గౌడ్, చేరాల సుధీర్, వంగూరి బాలకృష్ణ, దొడ్డమోని సురేష్, వంగూరి సతీష్, శంకర్ ఉన్నారు.


చౌటుప్పల్‌టౌన్: విశ్వేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


మోత్కూరు: ముశిపట్లలో అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు


రామన్నపేట: నిదాన్‌పల్లి మల్లన్నగుట్టపై ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

కక్కిరేణిలో నారీశక్తి ఫిట్‌నెస్ రన్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సామాజిక కార్యకర్త సైదులు

రామన్నపేట, మార్చి 9: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కక్కిరేణిలో మహిళలను ప్రోత్సహించేందుకు అన్ని రంగాల్లో రాణించే విధంగా నారీ శక్తి ఫిట్నెస్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువజన కేంద్రం జిల్లా వలంటీర్ కంబాలపల్లి సంపత్‌కుమార్‌యాదవ్, సామాజిక కార్యకర్త వేముల సైదులు మాట్లాడారు. పరుగు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెలిదె సంపత్, ఈదులకంటి శివకుమార్, సింగారం శ్రీనివాస్, మహిళలు బుర్ర మంగ, పిట్టల వసంత, కన్నెబోయిన లక్ష్మీ, చిల్ల దేవయాని, తిరుగుడు వరమ్మ, మంగమ్మ, సునీత, లక్ష్మీ, ప్రభావతి, అంజమ్మ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, మార్చి 8: క్రీడలు శారీరక దారుఢ్యాన్ని మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్లగిరి కేవైటీ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి విజేతకు రూ.60వేల నగదు అందజేస్తున్నట్టు తెలిపారు. ద్వితీయ బహుమతికి రిక్కల బాస్కర్‌రెడ్డి రూ.30 వేలు అందజేస్తున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రిక్కల ఇందిర సత్తిరెడ్డి, గుడ్డెటి యాదయ్య, నిర్వాహకులు ఎండి.ఇబ్రహీం, రిక్కల మహేందర్‌రెడ్డి, వెలమ రాజశేఖరెడ్డి, బాలగోని నర్సింహ, మనె ప్రవీణ్‌రెడ్డి, కందగట్ల జంగారెడ్డి, బక్కతట్ల శ్రీశైలం, యాదగిరి పాల్గొన్నారు

తుర్కపల్లి: యువత క్రడల్లో రాణించాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు గుండెబోయిన బాలుయాదవ్ అన్నారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో యువతకు వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేసిన సందర్భంగా మాట్లాడారు. యువత క్రీడలపై దృష్టి సారించి ఆయా పోటీల్లో తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. గుండెబోయిన భరత్, రాసాల నవీన్, మహిపాల్, ఆనంద్ ఉన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భువనగిరి టౌన్, మార్చి9: భువనగిరిలోని విజ్ఞాన్ గ్రూప్‌ఆఫ్ స్కూల్స్‌లో శనివారం పదో తరగతి వీడ్కోలు వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పదో తరగతి అనంతరం కోర్సులు, చదువులపై గ్రూప్ చైర్మెన్ డాక్టర్ పగిడాల జలేంధర్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు సంగరాజు శ్రీనివాస్ గుప్త అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు మానసికంగా సిద్ధం కావాలని, ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఒత్తిడి అధిగమించడంపై అవగాహన కల్పించారు. ఆటా పాటలతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.పురేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అపర్ణ, సత్యనారాయణ, స్వాతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రామన్నపేట: మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బోయపల్లి నిఖిల్‌సాయి హైదరాబాద్ నిజాం కాలేజ్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఎన్నికవడంపై కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వనం హర్షిని ఆధ్వర్యంలో నిఖిల్ సాయిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అడ్డగూడూరు: మండలంలోని కొడంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గొలుసుల వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గొలుసుల వెంకన్న భౌతికాయానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పూల మాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్, వెంకటేశ్వర్లు, కుమార్ ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గజరాజ్ కాశీనాథ్ ఎన్నికయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నియామక పత్రాన్ని అందజేసినట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

చౌటుప్పల్ టౌన్ : ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. స్థానిక కొండా లక్ష్మణ్ బాపూజీ సెంటర్ లో లయన్స్ క్లబ్ సేవా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాజు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్, అధ్యక్షుడు ప్రశాంత్, కార్యదర్శి కొసనం రామ్‌రెడ్డి, బి.మురళి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: బస్సు ప్రయాణికులకు వేసవి తీవ్రతనుంచి ఉపశమనం కల్పించే లక్ష్యంతో మోటకొండూర్ మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలతశ్రీనివాస్ సహకారంతో భువనగిరి బస్టాండ్‌లో శనివారం మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. బస్టేషన్ మేనేజర్ రత్నయ్య, కంట్రోలర్ సుధాకర్ రెడ్డి, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేశ్, శ్రీధర్, సిబ్బంది వెంకటేశ్, మురళి పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామంలో తన వ్యవసాయ బావివద్ద ఉన్న సుమారు 40 మోపుల గడ్డివాముకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని బాధితుడు బీమనబోయిన శ్రీను తెలిపాడు. ఈ విషయమై మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

మోత్కూరు: మునిసిపాలిటీలో బీజేపీ బూత్ కమిటీలను బలోపేతం చేసి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు కృషి చేయాలని బీజేపీ పరిశీలకుడు లింగాల శ్యాంసుందర్‌రెడ్డి, కూరాకుల వెంకన్న కోరారు. స్థానిక ఎస్‌వీఎం పాఠశాలలో బూత్‌ల అధ్యక్షులు, పట్టణ కమిటీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మునిసిపాలిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కొణతం నాగార్జునరెడ్డి, గౌరు శ్రీనివాస్, మరాటి అంజయ్య, సజ్జనం మనోహర్, ఆరె శ్రీనివాస్, దశరథ, మచ్చగిరి, శివ, వెంకన్న, ప్రకాష్, రమణ, మహేష్ పాల్గొన్నారు.

రామన్నపేట: గొరిగె మహేష్ కుటుంబానికి లారీ డ్రైవర్ అసోసియేషన్ రామన్నపేట తరపున రూ.32,100, అతని స్నేహితులు కలిసి రూ.21,200 నగదును గొరిగె మహేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మిరియాల మల్లేష్, బండ లింగస్వామి, మల్లా రవి, ఎగ్గె లింగస్వామి, కొండ వెంకటేష్, బెడిద శేఖర్, బడకా లింగస్వామి, మండల లింగస్వామి, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

నేడు మోత్కూరులో అంగడి ప్రారంభం

మోత్కూరు, మార్చి 9: మోత్కూరు మండల కేంద్రంలో కొవిడ్ సందర్భంగా మూతపడిన అంగడి (పశువుల సంతను)ని ఆదివారం (ఈ నెల 10న) పునఃప్రారంభించనున్నట్టు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వందేళ్లకు పైగా మోత్కూరులో నడుస్తున్న అంగడి కొవిడ్ కారణంగా 2020లో మూతపడిందన్నారు. గతంలో ఉన్న అంగడి స్థలంలోనే తిరిగి పశువుల సంత, తైబజార్‌ను ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం ప్రారంభిస్తారన్నారు. పూర్వంలానే అంగడిలో పశువులు, గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు నిర్వహించాలని, తైబజార్‌లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇతర వస్తువులు అమ్మకం, కొనుగోళ్లు సాగించాలని కోరారు. అంగడి ప్రారంభోత్సవానికి ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చింతచెట్టు పై నుంచి పడి ఒకరి మృతి

రాజాపేట, మార్చి 9: రాజాపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన కడారి పర్వతాలు (50) చింతచెట్టుపై నుంచి పడి శనివారం మృతి చెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన కడారి పర్వతాలు చింతకాయలు కోసేందుకు చింతచెట్టు ఎక్కి కాయలు రాలుస్తుండగా కొమ్మ విరిగి జారి పడ్డాడు. రాళ్లపై పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

మోత్కూరు, మార్చి 9: మోత్కూరు మండల కేంద్రంలోని వైజే ఫంక్షన్ హాల్ సమీపాన శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల మండలం గంగాపురం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. గంగాపురం గ్రామానికి చెందిన కాలి లక్ష్మి కుటుంబం కారులో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు జడలరామలింగేశ్వర స్వామిని దర్శించుకుని, రాత్రి అక్కడ నిద్ర చేసింది. శనివారం ఉదయం స్వగ్రామానికి తిరిగి వెళుతున్న క్రమంలో మోత్కూరులో వైజే ఫంక్షన్ హాల్ సమీపాన కారు అదుపుతప్పి బోల్తాపడి చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అందులో ప్రయాణిస్తున్న కాలి లక్ష్మీ, ఆమె కుమారుడు స్వామి, కుమార్తె జి.కావ్య, అల్లుడు శ్రీశైలం, మరో ఇద్దరు కోడళ్లు భాగ్య, విజయ గాయపడ్డారు. లక్ష్మి తలకు బలమైన గాయం కాగా కావ్య భుజం వద్ద గాయమైందన్నారు. గాయ పడినవారిని 108లో జనగాం ఆస్పత్రికి తరలించినట్టు ఈఎంటి బాస్కర్, పైలెట్ శంకర్ తెలిపారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

భువనగిరి రూరల్, మార్చి 9: మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణకు గురైన సంఘటన మండల పరిధిలోని జమ్మాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మాపురం గ్రామానికి చెందిన చిన్నబత్తిని లూసమ్మ ఉదయం బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్తానని బయలుదేరి నడుచుకుంటూ వెళుతుండగా మార్గమధ్యలోని జమ్మాపురం స్టేజి వద్దకు రాగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోంచి సుమారు రెండున్నర తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. బాధితురాలు లూసమ్మ కుమారుడు చిన్నబత్తిని సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

వంటగ్యాస్ ధర తగ్గింపు మోదీ కానుక

భువనగిరి టౌన్/ఆత్మకూరు(ఎం), మార్చి 9: వంట గ్యాస్ ధర రూ.100 తగ్గింపు ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు ఇచ్చిన కానుక అని మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి చంద్ర అన్నారు. ఈ మేరకు శనివారం భువనగిరిలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ పోషణ ఆర్థిక భారం తగ్గించడమే బీజేపీ లక్ష్యమన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికాల్లో ప్రధాని మోదీని మహిళలు మరోసారి ఆశీర్వదించి మూడోసారి ప్రధాని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, జిల్లా కార్యదరిశ వైజయంతి, నాయకులు కే లక్ష్మీ, రాణి, కనకమ్మ, తిరుమల, చంద్రకళ, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

● అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.100 తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆత్మకూరు(ఎం)లో ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు బి.అబ్బయ్య టి.మల్లారెడ్డి, బి.ఇంద్రారెడ్డి, కె.రబీందర్, ఎన్.శేఖర్‌రెడ్డి, ఎస్.నర్సిరెడ్డి పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మహిళలు రాజకీయాల్లో రాణించాలి


భువనగిరిటౌన్: సమావేశంలో మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, మార్చి 9: మహిళలు రాజకీయాల్లో రాణిస్తే స్వచ్ఛ పాలన సాధ్యమవుతుందని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అన్నారు. పట్టణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఇప్పటి వరకు రాజకీయాల్లో, చట్ట సభల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు కాల్వ స్వాతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షడు కూర వెంకటేశ్, మంజుల, మాటూరి అచ్చాలు, లక్ష్మీనాయక్ ఉన్నారు.

● చట్టాలపై అవగహన కలిగి ఉంటే మరింత భద్రత పొందవచ్చునని మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక, ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని ప్రభుత్వం, అధికారులు కఠినంగా అమలు చేయక పోవడంతో ఆయా వర్గాలు వివక్షకు గురవుతున్నాయని అన్నారు. సమావేశంలో కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్.శివలింగం, కన్వీనర్ దర్గా నర్సింగ్ రావు, కోఆర్డినేటర్ బండారు రవివర్ధన్, కో కన్వీనర్లు కల్వకుంట్ల జయ, జి.శంకర్, బూడిద శ్రీహరి, హీరోలాల్, భాస్కర్ నాయక్, బర్రె నరేష్ పాల్గొన్నారు.


వలిగొండ: మండలంలోని గోకారం గ్రామ పెద్దమ్మతల్లి మహిళా మత్స్యసహకార నూతన పాలక మండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షురాలిగా నూకల స్వాతి, ఉపాధ్యక్షురాలిగా బుంగపట్ల నాగమణి, కార్యదర్శిగా నూకల కావ్య, సభ్యులుగా కట్ట ప్రమీల, రొయ్యల కావ్య, మెదగోని మారెమ్మ, రొయ్యల అంజమ్మ, కట్ట లావణ్య, కట్ట అండాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రామన్నపేట: మండలంలోని మునిపంపుల గ్రామంలో కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గాదె శోభారాణి ఆధ్వర్యంలో గ్రామంలోని మాతృమూర్తులను, వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో బహుమతుల దాత ఆయ్యడపు కవిత, గ్రామ శాఖ అధ్యక్షురాలు సద్దల మంగమ్మ, మాజీ సర్పంచ్‌లు దేవిరెడ్డి సావిత్రమ్మ, దోగిపర్తి పద్మ, రాములమ్మ ఉన్నారు.

సుందర నగరంగా తీర్చిదిద్దుతా

● తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, మార్చి 9: మోత్కూరు మునిసిపాలిటీని సుందర నగరంగా తీర్చిదిద్దుతానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మోత్కూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చేలోగా మోత్కూరు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మధ్యన ఉన్న విద్యుత్ లైన్‌ను రోడ్డు అంచుకు మార్చిస్తామన్నారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్‌కు విద్యుత్ శాఖకు రూ.45 లక్షలు చెల్లించామన్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు మెయిన్ రోడ్డు సీసీ, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేయడానికి తాను అడిగిన వెంటనే రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.12 కోట్లు మంజూరు చేశారన్నారు. వంద ఏళ్లకు పైగా మోత్కూరులో నడుస్తున్న అంగడి (పశువుల సంతను)ని గత పాలకులు మూసివేశారని, ఆ అంగడిని వెంటనే పునఃప్రారంభిస్తామన్నారు. మోత్కూరులో పోస్టుమార్టమ్ సౌకర్యంతో కూడిన 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. కాశవాడలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను కూడా మార్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతీ నియోజక వర్గానికి రూ.పది కోట్లు కేటాయించిందని, అందులోంచి వేసవిలో మంచి నీటి అవసరాల కోసం రూ.1.70 కోట్లు కేటాయించామన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.13 కోట్లు మంజూరయ్యాయని, అందులో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు రూ.ఒక్కో కోటి మంజూరయ్యాయన్నారు. ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో శ్రీసీతారామచంద్రుని సన్నిధి నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలుమార్లు అల్లరి మూకలు ఫర్నీచర్‌ను ధ్వంసం చేసినందున తాను ఎమ్మెల్యే కాకముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. తమ అవసరాల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా తనను కలువవచ్చన్నారు. మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, మునిసిపాలిటీ కేంద్రంలో రూ.ఐదు లక్షల వ్యయంతో నిర్మించనున్న ఖబ్రాస్తాన్ ప్రహరీకి, 1, 2, 3, 7, 8 వార్డుల్లో రూ.ఐదేసి లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. నియో స్పోర్ట్స్ క్లబ్ యజమాని ఏర్పాటు చేసిన పోచం నారాయణ ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియంను, ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, జడ్పీటీసీ గోరుపల్లి శారదసంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, గుండగోని రామచంద్రు, పైళ్ల నర్సిరెడ్డి, తండ సత్తయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, బద్దం నాగార్జునరెడ్డి, పి.స్వామిరాయుడు, అవిశెట్టి అవిలిమల్లు, పోచం నారాయణ, ఎండి.అయాజ్, మునిసిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. మోత్కూరు మండల కేంద్రంలో ఇండోర్ (మినీ) స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోత్కూరు యాదయ్య, ఫుట్‌బాల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవినేని కృష్ణారావు ఎమ్మెల్యే సామేల్‌కు వినతి పత్రం అందజేశారు.


మోత్కూరు: సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలంలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చిత్తాలూరి సోమనారాయణ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకొన్ని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆ కుటుంబాన్ని పరమర్శించి, రూ.10 వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వళ్లంభట్ల రవీందర్, చిత్తాలూరి వెంకటయ్య, కూటికంటి రమేష్, కూటికంటి సోమయ్య, మందుల సోమయ్య, చిత్తాలూరి చైతన్య ఉన్నారు.